వచ్చే 3 రోజులు పలు చోట్ల భారీ వర్షాలు

హైదరాబాద్,మార్చి 24(నమస్తేతెలంగాణ): గత రెండు, మూడు రోజుల నుంచి వాతావరణం చల్లబడింది. తెలుగు రాష్ట్రాల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. వచ్చే మూడు రోజులు పలుచోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

వర్షాలతో ఉద్యాన పంటల్లో తెగుళ్లు సోకే ప్రమాదం

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): అకాల వర్షాల వల్ల ఉద్యాన పంటలలో తగిన జాగ్రత్తలు తీసుకొని.. రైతులు పంటలను రక్షించుకోవాలని కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి సూచించారు. మామిడి, టమాట, పసుపు పంటల్లో జరిగే నష్టాన్ని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించి సలహాలు, సూచనలు చేసింది.

విజిలెన్స్, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలివ్వండి

ప్రభుత్వానికి కాళేశ్వరం కమిషన్ లేఖ

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో లోపాలపై విజిలెన్స్ విచారణ, ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) సమర్పించిన నివేదికలను అందివ్వాలని ప్రభుత్వాన్ని కాళేశ్వరం కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు సర్కారుకు తాజాగా లేఖ రాసింది. ఈ అంశంపై విచారణ కోసం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో కాళేశ్వరం కమిషన్‌ను నియమించిన ఈ నేపథ్యంలో నివేదికలను అందివ్వాలని ప్రభుత్వానికి కమిషన్ ఆదేశించింది. వాటన్నింటినీ పరిశీలించి, నివేదికను సిద్ధం చేసేందుకు కమిషన్ సిద్ధమవుతున్నది.

బీసీలకు కాంగ్రెస్ వెన్నుపోటు!

- కేంద్రం సాకుతో 42% రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ ఎత్తులు
- ససేమిరా అంటున్న కుల సంఘాలు, మేధావులు
- నామినేటెడ్ పోస్టుల్లో చిత్తశుద్ధి చూపాలని డిమాండ్
- లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమని హెచ్చరిక



హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో, విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇటీవల అసెంబ్లీలో ప్రభుత్వం చట్టం చేసింది. ఆ చట్టాన్ని కేంద్రానికి పంపి, 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలనే సాకుతో కాంగ్రెస్ సర్కారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నది. చట్టం అమలును అటకెక్కించేందుకు సిద్ధమవుతున్నది. సర్కారు తీరుపై బీసీ మేధావులు, కులసంఘాల ప్రతినిధులు ఇప్పటికే తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాన్ని సాకుగా చూపి చట్టం అమలును పక్కనపెడితే ఊరుకోబోమని హెచ్చరిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పోస్టులు, ఇతరత్ర నియామకాల్లో అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా అమలు కోసం ఉద్యమిస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ఆది నుంచీ లోపాలే..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కులగణన నిర్వహించి, బీసీల రిజర్వేషన్ శాతాన్ని 42శాతానికి పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కామారెడ్డి డిక్లరేషన్‌లోనూ పొందుపరిచింది. అధికారంలోకి వచ్చిన అనంతరం కులగణనను కంటితుడుపుగానే చేపట్టింది. అడుగడుగునా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తుంగలోతొక్కింది. పూర్తిగా అశాస్త్రీయంగా, అనాలోచిత నిర్ణయాలతో ఇంటింటి సర్వేను మమ అనిపించింది. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల) గణాంకాలే అందుకు అద్దం పడుతున్నాయి. క్షేత్రస్థాయి పరిస్థితులకు, సర్కారు గణాంకాలకు ఎక్కడా పొంతనలేదని, పూర్తిగా అసంబద్ధంగా ఉన్నాయని బీసీ మేధావులు, కుల సంఘాల నేతలే కాదు, స్వయంగా కాంగ్రెస్ ప్రతినిధులే ఆరోపణలకు దిగారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ సర్కారు మాత్రం రాష్ట్రంలో మొత్తంగా 3.70కోట్ల మంది జనాభా ఉండగా, అందులో బీసీలు 46.25%, బీసీ ముస్లింలు 10.08%, ఎస్సీలు 17. 43%, ఎస్టీలు 10.45%, ఓసీ ముస్లింలు 2.48%, ఇతర ఓసీలు 13. 31% ఉంటారని నివేదించింది. కానీ ఆయా క్యాటగిరీల్లో కులాలు, ఉపకులాలవారీగా లెక్కలను మాత్రం వెల్లడించలేదు. నివేదికలోని లోపాలను సవరించాలని డిమాండ్లు వెల్లువెత్తినా ఏమాత్రం ఖాతరు చేయకుండా అసెంబ్లీలో బిల్లు పెట్టింది. ఆ తరువాత నివేదిక ఆధారంగా రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీ రిజర్వేషన్లకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసింది. బీసీ కమిషన్ నివేదిక లేకుండానే, కేవలం డెడికేటెడ్ కమిషన్ నివేదికనే రెఫరెన్స్‌గా పెట్టింది. ఇప్పుడు ఆ చట్టాన్ని తక్షణం అమలు చేయాలని బీసీ సంఘాలు, మేధావులు డిమాండ్ చేస్తుంటే, సర్కారు మాత్రం కేంద్రంపై నెపం మోపి చట్టాన్ని అటకెక్కించాలని చూస్తున్నది.

ఇదీ 9వ షెడ్యూల్డ్

ఈ అంశాన్ని 9వ షెడ్యూల్డ్‌లో చేర్చి రాజ్యాంగ సవరణ చేయాలంటూ కాంగ్రెస్ సర్కారు హైడ్రామాకు తెరతీసింది. 9వ షెడ్యూల్ అంశం అనేది ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదు. దశాబ్దాలుగా కొనసాగుతున్నదే. వాస్తవంగా కొన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాలను కోర్టుల్లో ఎవరూ సవాల్ చేయకుండా, సమీక్షించకుండా ఉండేందుకు, వాటిని యథావిధిగా అమలు చేసేందుకు వీలుగా రాజ్యాంగం లో 9వ షెడ్యూల్డ్‌ను 1951లో మొదటి సవరణ ద్వారా ఏర్పాటు చేశారు. 9వ షెడ్యూల్డ్‌లో పొందుపరచబడిన చట్టాలు, అంశాలు న్యాయ సమీక్ష పరిధిలోకి రావు. కోర్టులో సవాలు చేయలేం. దేశంలోని భూ సంస్కరణలు, జమీందారీ వ్యవస్థ రద్దు తదితర మొత్తంగా 284 చట్టాలు 9వ షెడ్యూల్డ్‌లో ఉన్నాయి. ఇందులో ప్రధానంగా తమిళనాడు ప్రభుత్వం 1993లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగ నియామకాల్లో 69శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసింది. అమలుకు అప్పటికప్పుడు జీవోలు జారీ చేసింది. ఉద్యోగాలు భర్తీ చేసింది. కాగా, కొందరు కోర్టుకు వెళ్లగా సుప్రీంకోర్టు రిజర్వేషన్లు కొట్టివేసింది. దీంతో తమిళనాడు ప్రభుత్వం అఖిలపక్షాన్ని తీసుకుని ఢిల్లీ వెళ్లి అక్కడే మకాం పెట్టి అప్పటి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాజ్యాంగ సవరణ చేసింది. అనేక చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొన్న తర్వాత దానిని 9వ షెడ్యూల్డ్‌లో చేర్చి తమిళనాడు కల్పించిన రిజర్వేషన్లకు న్యాయసమీక్ష నుంచి రక్షణ కల్పించుకున్నది. 9వ షెడ్యూల్డ్‌లో చేర్చినంత మాత్రాన న్యాయ సమీక్ష పరిధిలోకి రావని అనుకోవద్దని, అవసరమైతే వాటిని సైతం సమీక్షిస్తామని సుప్రీం కోర్టు పలు కేసుల విచారణ సందర్భంగా ఇప్పటికే వెల్లడించింది.

కేంద్రంపై కాంగ్రెస్ నెపం!

తమిళనాడు సర్కారు సహేతుకమైన, శాస్త్రీయమైన గణాంకాలతో కేంద్రాన్ని ఒప్పించింది. న్యాయసవాళ్లను అధిగమించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేరుకోసమే బీసీలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, స్థానికసంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసిందని వివరిస్తున్నారు. అమలు కోసం ఇప్పటివరకు జీవోలు విడుదల చేయకుండానే కేంద్రంపై నెపం నెట్టేందుకు పూనుకున్నదని తెలుపుతున్నారు. చట్టాలను అమలులోకి తీసుకురాకుండానే, ఎలాంటి కార్యాచరణ చేపట్టకుండానే 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలంటూ

మోసం చేస్తే ఊరుకునేది లేదు

కోర్టుల బూచిగా చూపి, 9వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను తప్పుదోవ పట్టిస్తున్నది. కేంద్రంపై నెపం మోపి బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని కాంగ్రెస్ అటకెక్కించాలని చూస్తున్నది. పేరుకే చట్టం చేసింది తప్ప, అమలు చేసేందుకు ఏ దశలోనూ చిత్తశుద్ధిని చూపడం లేదు. స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో 42% రిజర్వేషన్లు అమలు చేసే వరకూ కాంగ్రెస్‌పై రాజీలేని పోరాటం చేస్తాం. రేవంత్ సర్కార్ మోసపూరిత వైఖరిని బీసీ సమాజానికి తెలియజేస్తాం.

– రాజారాం యాదవ్, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు

బీసీ సంఘాల డిమాండ్లు..

రిజర్వేషన్లు అమలు చేసే అవకాశమున్నా.. రేవంత్‌రెడ్డి సర్కార్ మాత్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని బీసీ సంఘాల మేధావులు, కులసంఘాల నేతలు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రెండు జీవోలు విడుదల చేయాలని, స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో 42% రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అంతే కాదు ప్రభుత్వ నామినేటెడ్, కోర్టులు, ఇతరత్రా ప్రభుత్వసంస్థల్లో చేపట్టే నియామకాల్లో, కాంట్రాక్టు పనుల్లో 42% రిజర్వేషన్లు కల్పించి చిత్తశుద్ధిని చాటుకోవాలని తేల్చిచెబుతున్నారు. కేంద్రంపై నెపంమోపి, చట్టాలను అటకెక్కిస్తే ఊరుకోబోమని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

నీరాకేఫ్ గొడన్నలదే

- ఫలించిన గొడన్నలు, బీఆర్ఎస్ పోరాటం.. జీవో జారీ చేసిన ప్రభుత్వం
- ఆదాయంలో గీత కార్పొరేషన్‌కు 70%, టూరిజం శాఖకు 30 %
- కేఫ్ పరిరక్షణ పోరాటంలో 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు కీలకపాత్ర

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గొడన్నల ఆత్మగౌరవ పతాకగా హైదరాబాద్‌లో నిర్మించిన నీరాకేఫ్‌ను హోటల్‌గా మార్చేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు వెనక్కి తగ్గింది. ఈ మేరకు నీరా కేఫ్‌ను రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. 'ప్రభుత్వం ఎక్సైజ్, పర్యాటకశాఖలతో సంప్రదింపులు జరిపిన తర్వాత నీరా కేఫ్‌ను పర్యాటకశాఖ నుంచి తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు బదిలీ చేస్తున్నట్టు తెలిపింది. ఆ భూమి టూరిజం శాఖది కావడంతో నీరాకేఫ్ నుంచి వచ్చే ఆదాయంలో 30శాతం టూరిజంశాఖకు చెల్లించాలని పేర్కొంది. బీసీ సంక్షేమశాఖ, పర్యాటకశాఖ, రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. దీంతో బీఆర్ఎస్ నాయకత్వంలో గొడన్నలు, కల్లుగీత కార్మిక సంఘాలు చేసిన పోరాటం ఫలించింది.

నీరాకేఫ్ కోసం అలుపెరుగని పోరాటం

నీరా కేఫ్‌ను హోటల్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని, ఫిబ్రవరి 22న 'నమస్తే తెలంగాణ' కథనంలో వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో గౌడ సంఘాలు, కల్లుగీత కార్మికులు తీవ్రస్థాయిలో స్పందించారు. ఫిబ్రవరి 23న కేఫ్‌ను సందర్శించిన శ్రీనివాస్‌గౌడ్ 'నీరా కేఫ్‌ను తరలించడమంటే.. గౌడన్నల గుండెలపై తన్నడమే' అని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం రాష్ట్రంలోని గౌడ సంఘాలను ఒకతాటిపైకి తీసుకొచ్చి ఉద్యమించారు. దీంతో పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యాలయం స్పందించింది. 'నీరాకేఫ్‌ను ఎక్కడి తరలించడం లేదు' అంటూ వార్త రాసిన 'నమస్తే తెలంగాణ' రిజాయిండర్ పంపింది. 24 గౌడ సంఘాల నేతలు ఉద్యమ కార్యచరణ ప్రకటించి మార్చి 17న హైదరాబాద్‌లో మహాధర్నా చేపడుతున్నామని అల్టిమేటం జారీ చేశారు. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం నీరా కేఫ్‌ను తరలించబోమని ఆగమేఘాల మీద సర్క్యూలర్ జారీ చేసింది. 'సర్క్యూలర్ వద్దు జీవో ముద్దు' అంటూ గౌడన్నలు ఆందోళనలు చేయడంతో జీవో విడుదల చేస్తూ మార్చి 24న జీవో ఇచ్చింది. ఈక్రమంలో గత ఫిబ్రవరి 22 నుంచి మార్చి 22 వరకూ నీరా కేఫ్ గురించి 'నమస్తే తెలంగాణ' వరుసగా కథనాలు రాయడం పట్ల గౌడ సంఘాలు, కల్లుగీత కార్మిక సంఘాల నేతలు అభినందనలు తెలిపారు. తమ పోరాటాలకు తలొగ్గి ప్రభుత్వం జీవో ఇవ్వడం పట్ల మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్, గౌడ, కల్లుగీత సంఘాల నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, గౌడ విద్యార్థి సంఘం నాయకులు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

ముగ్గురికి ముకుతాడు!

- ఇద్దరు దళిత మంత్రులపై వేటుకు రంగం సిద్ధం
- నంబర్ 2 నుంచి వెనుక వరుసలోకి ఓ మంత్రి
- ముగ్గురికి అప్రధాన శాఖలు తప్పవంటున్న పార్టీ శ్రేణులు
- కూలుడు, కుంగుడు గోల తనకు వద్దంటున్న ఓ మంత్రి

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): ఆ ముగ్గురు మంత్రులు బలిపీఠానికి చేరువలో ఉన్నారా? మంత్రివర్గ విస్తరణలో వారికి అప్రధాన శాఖలు అంటగట్టబోతున్నారా? లేక అసలుకే ఎసరు వస్తుందా? అంటే 'అవును 'అనే అంటున్నాయి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. త్వరలో జరగబోతున్న మంత్రివర్గ విస్తరణలో ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన మరో మంత్రికి అప్రధాన శాఖలను అంటగట్టేందుకు రంగం సిద్ధమైనట్టు కాంగ్రెస్ శ్రేణులో ప్రచారం జరుగుతున్నది. వీరిలో ఇద్దరు మొదటి నుంచీ కాంగ్రెస్ వాదులైన సీనియర్ దళిత మంత్రులు కాగా, మరొకరు మొన్నటి వరకు ముఖ్య నేతకు అత్యంత నమ్మకస్తుడిగా, రాష్ట్రంలో నంబర్ 2 మంత్రిగా చెప్పుకున్న రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో కమీషన్లు, శాఖల్లో పైరవీలు, వివాదాస్పద భూముల సెటిల్‌మెంట్లు, కబ్జాలు తదితర ఆరోపణల నేపథ్యంలో వారిని కీలక శాఖల నుంచి తప్పించి, అప్రధాన శాఖలు అప్పగిస్తారని ప్రచారం జరుగుతున్నది. ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రుల్లో ఒకరు 20% మంత్రిగా, మరొకరు 30% మంత్రిగా విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల సెక్రటేరియట్‌లోనే ఒక మంత్రి చాంబర్ ఎదుట కాంట్రాక్టర్లు ధర్నా చేసిన నేపథ్యంలో ఢిల్లీ అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నట్టు తెలిసింది. ఈ సంఘటనపై ఢిల్లీ దూత ఒకరు హైదరాబాద్‌కు వచ్చి విచారణ చేసి వెళ్లినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. భూముల వ్యవహారాలు చక్కబెట్టిన ఒక మంత్రి ప్రతి పనిలోనూ 30% వాటా తీసుకున్నట్టు అధిష్ఠానం వద్ద ఆధారాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతున్నది. అతి తక్కువ కాలంలో బలమైన ఆర్థికశక్తిగా ఎదిగిన ఆ మంత్రిని పూర్తిగా తప్పించే ఆలోచనతో అధిష్ఠానం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. మెదక్ జిల్లాకు చెందిన సీనియర్ మంత్రిపై కూడా ఉద్యోగుల బదిలీలు, డిప్యూటేషన్లు, పరికరాల కొనుగోళ్లలో పర్సంటేజ్ తీసుకుంటున్నారనే ఆరోపణలు ఢిల్లీ అధిష్ఠానానికి చేరినట్టు గాంధీభవన్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ ముగ్గురిపై వేటు తప్పదని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

కూలుడు..కుంగుడు గొడవలే..

సీనియర్ మంత్రి ఒకరు ప్రస్తుతం తనకున్న ఒక శాఖను వద్దంటే వద్దని చెప్తున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిగిన ఆ శాఖ, ఇప్పుడు తనకు గుదిబండ తీరుగా ఉన్నదని నేరుగా ఢిల్లీ అధిష్ఠానానికే ఆయన చెప్పినట్టు కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. తాను పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కూలుడు, కుంగుడు, కేసులు, కమిషన్ల గొడవలు తప్ప మరో పనే లేదని ఆవేదన వ్యక్తంచేసినట్టు తెలిసింది. నిరుడు ఆ శాఖకు రూ.వేల కోట్లు కేటాయించి ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించారని, ఇప్పుడు ఆ శాఖకు అరకొర నిధులే కేటాయిస్తున్నారని, శాఖను తొలగించి మరో కీలకమైన శాఖ ఇవ్వాలని ఇప్పటికే ఆయన అధిష్ఠానాన్ని కోరినట్టు తెలిసింది. మొత్తానికి నలుగురు మంత్రుల శాఖల్లో మార్పులు చేర్పుల మీద కసరత్తు చేస్తున్నట్టు, ఇందులో ఇద్దరికి అసలుకే ఎసరు వచ్చే అవకాశాలు కూడా లేకపోలేదని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

నగరంలో ఘోరాలు

మొదటిపేజీ తరువాయి...

నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. ఆమెతలకు, దవడ ఎముకకు గాయమైందని, సరిగ్గా మాట్లాడలేకపోతున్నదని రైల్వే పోలీసులు తెలిపారు. నిందితుడిని గుర్తుపడతానని బాధితురాలు చెప్పడంతో స్పెషల్ టీమ్స్‌ను ఉపయోగిస్తున్నట్టు ఎస్సీ చందన తెలిపారు.

షాపు ప్రారంభానికని పిలిపించి..

హైదరాబాద్‌కు చెందిన కొందరు బాలీవుడ్‌కు చెందిన ఓ సహాయనటిని షాపు ప్రారంభానికని ముంబై నుంచి ఈ నెల 18న పిలిపించారు. ఆమెకు మాసబ్‌ట్యాంక్‌లోని సత్య అపార్ట్‌మెంట్స్‌లో వసతి కల్పించారు. ఈ నెల 21న ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు ఆమె ఉంటున్న గదిలోకి వచ్చి వ్యభిచారం చేయాలంటూ ఒత్తిడి చేశారు. ఆమె ఒప్పుకోకపోవడంతో దాడికి పాల్పడి, ఆమె వద్దనున్న రూ.50వేలు తీసుకొని పారిపోయారు. బాధితురాలు 100కు ఫోన్‌చేయడంతో పోలీసులు వచ్చి ఆమెను విడిపించారు. నిందితులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పది సెక్షన్ల కింద కేసులు నమోదుచేశామని చెప్పారు. ఆర్థిక లావాదేవీల్లో తేడాతోనే తప్పుడు ఫిర్యాదు చేశారని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని మాసబ్‌ట్యాంక్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

నడిరోడ్డుపై లాయర్ హత్య

ఓ మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగించేందుకు సహకరించలేదన్న కోపంతో ఓ దుండగుడు ఏకంగా ఓ న్యాయవాదిని నడిరోడ్డుపై దారుణంగా చంపాడు. చంపాపేట డివిజన్, ఈస్ట్ మారుతీనగర్, శ్రీనివాస అపార్ట్‌మెంట్‌లో నివసించే ఇజ్రాయెల్ (54) రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఆయన ఉండే అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా కాంతారావు, అతని భార్య కల్యాణి పనిచేస్తున్నారు. ఈ అపార్ట్‌మెంట్‌కు అప్పుడప్పుడు ప్లంబింగ్, ఎలక్ట్రిసిటీ మరమ్మతులకు వచ్చే దస్తగిరికి కల్యాణితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇది తెలిసిన కాంతారావు తన భార్యను తీసుకొని సొంత ఊరు వెళ్లిపోయాడు. కల్యాణిని ఎలాగైనా మళ్లీ నగరానికి రప్పించాలని దస్తగిరి వెళ్లి న్యాయవాది ఇజ్రాయెల్‌ను కోరాడు. తాను న్యాయవాదినని, బ్రోకర్‌ను కానని, పద్ధతులను మార్చుకోవాలని ఇజ్రాయెల్ హెచ్చరించాడు. అయితే తాను కాంతారావును హత్య చేస్తానని, అరెస్టయితే కనీసం బెయిల్ ఇప్పించాలని దస్తగిరి కోరాడు. దీనికి అంగీకరించని ఇజ్రాయెల్ అతడిని మందలించాడు. దీంతో కక్ష పెంచుకున్న దస్తగిరి పథకం ప్రకారం సోమవారం ఉదయం ఇజ్రాయెల్‌పై కత్తితో దాడిచేశాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు అతడిని డీఆర్‌డీఓ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద హత్య

జియాగూడ: బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రక్తపు మడుగులో పడి ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసుల కనుగొన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలోని మనోరంజన్ కాంప్లెక్స్ వెనుక ఓ గుర్తు తెలియని వ్యక్తి (35) మృతదేహం ఉన్నట్టు స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. తలపై తీవ్రగాయలు ఉండడంతో బండరాళ్లతో కొట్టి చంపినట్టు నిర్ధారించారు.

మహిళల భద్రత ప్రశ్నార్థకం: బీఆర్ఎస్

ఇందిరమ్మ రాజ్యంలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని బీఆర్ఎస్ నేతలు ఆందోళన వ్యక్తంచేశారు. ఎంఎంటీఎస్ రైలులో ఉద్యోగినిపై లైంగికదాడి యత్నమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. బాధితురాలిని మాజీ మంత్రి సబిత పరామర్శించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళల భద్రతపై దృష్టి సారించాలని అన్నారు.

ఇంటి పన్ను కట్టలేదని తలుపులు తీసుకెళ్లారు

- భూపాలపల్లిలో మున్సిపల్ అధికారుల నిర్వాకం
- నోటీసు ఇవ్వకుండా విరుచుకుపడ్డ అధికారులు
- సమయం కోరినా వినిపించుకోకుండా దౌర్జన్యం
- 15 రోజులుగా తలుపులు ఇవ్వకుండా వేధింపులు
- మాకిక ఆత్మహత్యే శరణ్యం
- మీడియా ముందు విలపించిన గిరిజన కుటుంబం

తలుపులు లేని ఇంటివద్ద మాట్లాడుతున్న హునానాయక్ దంపతులు

కృష్ణకాలనీ, మార్చి 24: జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మున్సిపాలిటీ అధికారులు ఓ గిరిజన కుటుంబంపై దౌర్జన్యంగా వ్యవహరించారు. ఇంటి పన్ను కట్టలేదంటూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తలుపులు తీసుకెళ్లారు. 15 రోజులైనా తలుపులను తిరిగి ఇవ్వకుండా వేధింపులకు పాల్పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే ములుగు జిల్లా రామచంద్రాపురానికి చెందిన హునానాయక్ 30 ఏండ్ల క్రితం కుటుంబంతో కలిసి బతుకుదెరువు కోసం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకుంటపల్లి తండాకు వచ్చాడు. స్థానికంగా మేకల కాపరిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 15 రోజుల క్రితం మున్సిపాలిటీ అధికారులు వచ్చి రూ.20 వేల ఇంటి పన్ను ఉన్నదని, రూ.5,500 కడితే చాలని, మిగతావి 6 నెలల తర్వాత కట్టవచ్చని చెప్పారు. దీంతో హునానాయక్ అప్పుతెచ్చి రూ. 5,500 కట్టాడు. కానీ శనివారం సిబ్బంది మళ్లీ వచ్చి మిగతా రూ.15 వేలు కట్టాలని ఒత్తిడి తెచ్చారు. కొంత సమయం ఇవ్వాలని కోరగా, అందుకు ససేమిరా అన్న సిబ్బంది ఇంటికి ఉన్న తలుపులు తీసుకుని వెళ్లారు.

తలుపులు ఇవ్వకపోతే ఆత్మహత్యే దిక్కు

అధికారులు మా ఇంటి తలుపులు పట్టుకెళ్లి, మా పరువు తీశారు. మాది నిరుపేద కుటుంబమని, ఒక్కసారిగా పన్ను డబ్బులు కట్టలేమని చెప్పినా వినిపించుకోలేదు. కొంత సమయం కావాలని వేడుకున్నా పట్టించుకోలేదు. మమ్మల్ని ఇష్టమొచ్చినట్టుగా దూషిస్తూ ఇంట్లోని సామాన్లు కిందపడేశారు, తలుపులు తీసుకెళ్లారు. మా పరిస్థితిని జిల్లా కలెక్టర్ అర్థం చేసుకుని, తలుపులు ఇ ప్పించాలి. లేకపోతే కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ ముందు పురుగులమందు దు తాగి ఆత్మ హత్య చేసుకుంటాం.

– హునానాయక్, పెద్దకుంటపల్లితండా

దేశానికి ఆదర్శంగా పౌరసరఫరాల సంస్కరణలు

- వేగంగా ధాన్యం కొనుగోళ్లు, డబ్బులు చెల్లింపులు
- రూ. 409 కోట్ల విలువైన బియ్యం స్వాధీనం: డీఎస్ చౌహాన్

హైదరాబాద్, మార్చి 24(నమస్తే తెలంగాణ): పౌరసరఫరాలశాఖలో చేపట్టిన సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయడంతోపాటు 48 గంటల్లోనే చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, సీఎమ్మార్ ఎగవేతలపై కఠిన చర్యలు తీసుకున్నామని, ఏడాది కాలంలో రూ.409 కోట్ల విలువైన అక్రమ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సోమవారం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లోని ఐఐఎంలో నిర్వహించిన అంతర్జాతీయ కార్యక్రమంలో చౌహాన్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అక్రమాలకు అడ్డుకట్ట వేశామని, వందశాతం రూట్ ఆప్టిమైజేషన్ మైలురాయిని సాధించి తెలంగాణ దేశంలో మొదటి రాష్ట్రంగా నిలిచిందని, ఫలితంగా ప్రభుత్వానికి ఏడాదికి రూ.12 నుంచి 15 కోట్లు ఆదా అవుతున్నాయని వెల్లడించారు. పేదలకు నాణ్యమైన బియ్యం పంపిణీలో భాగంగా ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పంపిణీ చేయబోతున్నట్టు పేర్కొన్నారు.

ఖాళీలు ఆరు.. పోటీలో 30 మంది!

- మంత్రివర్గ వి